01ATP29F_01ATP29F.qxd 29-10-2025 PM 11:05 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 30 అక్టోబర్ 2025 పేజీలు : 04

నేడు అహుడ కార్యాలయంలో గ్రీవెన్స్

-అహుడ చైర్మన్ టిసి వరుణ్

అనంతపురం అక్టోబరు29 ప్రభాతవార్త

అనంతపురం హిందూపురం అర్బన్ అథారిటీ పరిధిలో నెలకొన్న సస్యలు పరిష్కారం కోసం గురువారం అహుడా కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు టిసి వరుణ్ ఒక ప్రకటనలో తెలిపాడు. లేఔట్లకు సంబంధించిన అనుమతులు, ఇతరత్రా సమస్యలు వుంటే సంబంధితులు ఫిర్యాదులు అందజేసి పరిష్కారం పొందవచ్చన్నాడు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార చర్యలు వుంటాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశాడు.

గుమ్మగట్ట ఎంఈఓ-2 సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్జేడీ

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 29 ప్రభాతవార్త

గుమ్మగట్ట మండల విద్యాశాఖ అధికారి-2 డా.రామచంద్రను సస్పెన్షన్ చేస్తూ విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. ప్రసాద్ బాబు తెలిపారు. ఆయన గతంలో న్యామద్దల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గా పనిచేస్తున్న సమయంలో నాడునేడు నిధులు రూ.12 లక్షలలో అక్రమాలు జరిగాయని విద్యాశాఖ కమిషనర్ కు ఫిర్యాదు అందింది. ఇందుకు కమిషనర్ స్పందించి జిల్లా కలెక్టర్ ద్వారా సమగ్రశిక్ష డిఈ జయరాంతో విచారణ చేయించారు. ఆ విచారణ నివేదిక ఆధారంగా ఇటీవల ఆయనకు షోకాజ్ నోటీస్ కూడా జారీ చేసినట్లు తెలిపారు. అందుకు ఆయన గడువులోపు వివరణ ఇవ్వలేదు. విచారణ నివేదిక ఆధారంగా, షోకాజ్ నోటీస్‌కు గడువులోపు వివరణ ఇవ్వకపోవడంతో ఆయన్ను సస్పెన్షన్ చేశారని తెలిపారు.

కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్‌కుమార్ తొలగింపు

- విధి నిర్వహణలో చట్ట విరుద్ధంగా వ్యవహరించినందుకు ప్రభుత్వం చర్య

తలారి రాజ్ కుమార్

కళ్యాణదుర్గం, అక్టోబర్ 29 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ తలారి రాజ్‌కుమార్ ను పదవి నుండి తొలగిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విధి నిర్వహణలో చట్టవిరుద్ధంగా ప్రవర్తించడం, చట్టబద్ధమైన బాధ్యతలను నిర్వర్తించకపోవడం వంటి కారణాలతో ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి (జి) శాఖ జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నం.1194, తేదీ 29102025 ప్రకారం చైర్‌పర్సన్‌గా రాజ్‌కుమార్ రెండు నెలల వ్యవధిలో రెండు కౌన్సిల్ సమావేశాలను జరపాల్సి ఉన్నా నిర్వహించలేదని, 2024 నవంబర్, డిసెంబర్ నెలల్లోను, 2025 ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లోను కౌన్సిల్ సమావేశాలు జరగలేదని ప్రభుత్వం గుర్తించింది. కౌన్సిల్ సభ్యుల మూడో వంతు అభ్యర్థించిన ప్రత్యేక సమావేశాన్ని కూడా ఆయన ఏర్పాటు చేయలేదని ఉత్తర్వులో పేర్కొంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 22న ప్రభుత్వంచే షోకాజ్ నోటీసు జారీచేయగా, ఆయన 15 రోజుల్లో వివరణ ఇవ్వకపోవడంతో, అందుబాటులో ఉన్న ఆధారాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సెక్షన్ 60(1) ప్రకారం ప్రభుత్వానికి ఉన్న అధికారాన్ని వినియోగించి, చైర్‌పర్సన్ రాజ్‌కుమార్‌ను పదవి నుండి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ ఎస్.సురేష్ కుమార్ తెలిపారు.

రైతులను అష్ట కష్టాల పాలుచేసిన భారీ వర్షాలు..!

ఇంద్రావతి వద్ద వేరుశెనగ పంట తొలగించిన పొలంలో కుప్పలుగా వేయగా వర్షాలకు తడిసి కుళ్లిపోయిన దృశ్యం

ఉరవకొండ, అక్టోబర్ 29 ప్రభాతవార్త

తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు ఉరవకొండ ప్రాంత రైతులను కష్టనష్టాలపాలు చేస్తున్నాయి. భారీ వర్షాలతో వ్యవసాయశాఖ ఉరవకొండ డివిజన్‌లోని వివిధ మండలాల్లో తొలగించి పొలాల్లో ఆరబెట్టిన వేరుశెనగ పంట కుళ్లిపోయి పశుగ్రాసం సైతం దక్కని పరిస్థితులు ఏర్పడగా, దాదాపు

-తొలగించిన వేరుశెనగ పంట పొలాల్లోనే కుళ్లిపోతున్న వైనం

-పక్షం రోజుల పప్పుశెనగ పంట కొట్టుకుపోయిన దైన్యం

-పరిహారం అందించి ఆదుకోవాలంటున్న బాధిత రైతులు

-ప్రత్యామ్నాయ విత్తనాల కోసం రైతుల ఎదురుచూపులు

పక్షం రోజుల వయసుగల పప్పుశెనగ పంట పూర్తిగా దెబ్బతింది. అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నామని తమకు ప్రభుత్వం పరిహారం, పప్పుశెనగ, ఇతరత్రా ప్రత్యాన్నాయ పంటల విత్తనాలు ఉచితంగా అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే...

వ్యవసాయశాఖ ఉరవకొండ డివిజన్‌లో ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, గుంతకల్లు మండలాలు ఉండగా ఖరీఫ్ పంట కాలంలో 28,969 హెక్టార్లలో వేరుశెనగ పంట

మిగతా 3లో...

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

ముంపు ప్రాంతాల శాశ్వత పరిష్కారానికి

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- నిధులు మంజూరు చేయిస్తా : ఎంపి అంబికా లక్ష్మీనారాయణ
- నడిమివంక, మరువవంక ఆక్రమణలు తొలగిస్తాం : ఎమ్మెల్యే దగ్గుపాటి
- సజావుగా సాగిన కౌన్సిల్ సమావేశం

అనంతపురం అక్టోబరు 29 ప్రభాతవార్త

నగరంలో వర్షాలకు ముంపుకు గురి అయ్యే ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికను సిద్ధ చేసి ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేయిస్తానని అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ తెలిపాడు. అదేవిధంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ నడిమివంక, మురువవంకకు ఇరువైపుల వున్న ఆక్రమణలు తొలగిస్తామని వెల్లడించాడు. బుధవారం నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాలులో సాధారణ కౌన్సిల్ సమావేశం నగర మేయర్ మహమ్మద్ వసీం అధ్యక్షతన నగర కమిషనర్ బాలస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపి, ఎంఎల్ఏలు హాజరై పలు సమస్యలపై స్పందించి, నగరాభివృద్ధి కోసం కౌన్సిల్ సభ్యులు పలువురు నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సభదృష్టికి తీసుకురాగా వాటి పరిష్కార మార్గాలకు తగు చర్యలు తక్షణం తీసుకుంటామని హామి ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటి మేయర్ కొగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో ప్రధానంగా కొన్ని కాలనీలు వర్షాకాలంలో ప్రతిసారి ముంపుకు గురౌతున్నాయని ప్రశ్నిస్తూ వాటికి శాశ్వత పరిష్కార మార్గాలను కూడా సూచించాడు. ఇందులో ప్రధానంగా బళ్లారి రోడ్డు నుంచి నడిమివంకకు నీరు కలిసే విధంగా చర్యలు తీసుకుంటే జనశక్తినగర్, యువజనకాలనీ, రజక్‌నగర్, బాలాజీ కాలనీలకు వరద నీరు రాకుండా కట్టడి చేయగలమన్నారు. అదేవిధంగా రజకనగర్ దిగువన నడిమివంక నీరు పోకుండా దాదాపు 50 మీటర్లు పొడవున అడ్డంకులు వున్నాయని, వీటిని తొలగిస్తే నీరు సజావుగా వెళుతుందన్నాడు. దీనివల్ల యువజన కాలనీ, రజకనగర్, సోమనాథనగర్, చాలాజీ కాలనీల్లోకి వర్షపు నీరు పోకుండా వుంటుందన్నాడు. అలాగే 35,36,37,38 డివిజన్ల పరిధిలో మంగలవారి కాలనీ, నల్లపురెడ్డి కాలనీ, శ్రీనగర్ కాలనీ, మారుతీనరగ్ మొదటి క్రాస్ నుంచి రుద్రంపేట నుంచి వచ్చే నీరు, సర్వీసు రోడ్డు నుంచి అదే కాలవను నడిమివంకలో కలపడం వల్ల రామ్‌నగర్, పరిసరప్రాంతం ,కొవ్వూరు పరిసర ప్రాంతం ముంపుకు గురికాకుండా చేయవచ్చన్నాడు. అదేవిధంగా ఆర్టీసి బస్టాండు దగ్గర రాజహంస ప్యాలెస్ ఎదురుగా (గుత్తిరోడ్డువైపు) మరువవంక ప్రవేటు స్థలంలో వంక వెళుతుందని స్థల యజమానులు అడ్డు వేయడం వల్ల నీరు రోడ్లపైకి వస్తున్నాయని వారికి నష్టపరిహారం చెల్లిస్తే శాశ్వత పరిష్కారం చూపగలమని సభ దృష్టికి తీసుకెళ్లాడు. దీనికి స్పందించిన ఎంపి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నగరంలో ముంపు గురౌతున్న ప్రాంతాలకు సంబంధించి డిప్యూటి మేయర్ కొగటం విజయ భాస్కర్‌రెడ్డి సూచించిన మేరకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటాని సభముఖంగా ఎంపి హామి ఇచ్చాడు.

కుక్కల ఆపరేషన్, పశువుల బెడద వంటి సమస్యలను పలువురు కార్పొరేటర్లు సభలో లేవనెత్తగా వీటిపై సభ్యులతో కూడిన ఒక కమిటి వేసి ఎలాంటి అరోపణలు, అపోహలకు తావులేకుండా నిబంధనల ప్రకారం వ్యవహరిస్తామని కమిషనర్ బాలస్వామి వివరణ ఇచ్చాడు. అలాగే కొందరు కార్పొరేటర్లు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు దాదాపు 40శాతం మంది అనారోగ్యం పేరుతో బదిలీలు పెట్టుకుని వ్యాపారాలు, ఇతరత్రా వ్యవహారాలు నడుపుతున్నారన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఏది చెపితే అదే శాసనంగా వుంటోందని, హాజరు వేసుకున్న తర్వాత వారికి కేటాయించిన విధులకు వెళ్లడంలేదని సభకు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పర్యవేక్షణ నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామి ఇచ్చాడు. మేయర్ వసీం మాట్లాడుతూ ఏసిపిగా పదోన్నతిపై టిపిఓ శిరీషను తనకు తెలియకుండా ఎలా రిలీవ్ చేస్తావని కమిషనర్ ప్రశ్నించాడు. కౌన్సిల్ సమావేశం అయిన తర్వాత పంపాలని కమిషనర్‌ను మేయర్ నిలదీయగా, దీనికి స్పందించిన కమిషనర్, పదోన్నతి ఇచ్చి బదిలీ చేసినపుడు అక్కడ విధుల్లో చేరకపోతే ఉద్యోగానికి ముప్పు వుంటుందని, ప్రభుత్వ నిబంధనల మేరకు రిలీవ్ చేశానని వివరించాడు. అలాగే మద్యం షాపులు ఉదయం 6గంటలకే తీస్తుండడం వల్ల కార్మికులు కొందరు మద్యం సేవించి విధులకు హాజరౌతున్నారని, మహిళా కార్పొరేటర్లు పని ఎలా చేయించగలమని ప్రశ్నించారు. ఎక్సైజ్ అధికారులను పిలిపించాలని కోరగా, నిబంధనల మేరకు కౌన్సిల్‌కు వారిని పిలిపించే అధికారంలేదని, సభ్యులు లేవనెత్తిన సమస్యను ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళుతానని కమిషనర్ తెలిపాడు. ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ షాపులు ఉదయం 6 గంటలకు ఎక్కడైనా తెరిచి వుంటే ఫోటోలు, వీడియో లతో ఆధారాలు పంపితే అధికారులను పంపించి షాపు లను సీజ్ చేయిస్తానన్నాడు. ప్రభుత్వ హెల్త్‌సెంటర్లలో మందులు, చికిత్సకు కనీస పరికరాలు కూడా లేవని వాటిపై దృష్టి సారించాలని కోరారు. దీనిపై డిఎంఅండ్ హెచ్ఓ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని కార్పొరేటర్లకు కమిషనర్ తెలిపాడు.

ఎంపి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమావేశం ప్రశాంత వాతావరణం నిర్వహించడం అభినందనీయమని, పాలకవర్గ సభ్యులు వారి వారి పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తీసుకొచ్చారని, వీటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని అవసరమైతే తనవంతు సహకారం సంపూర్ణంగా వుంటుందని సభాముఖంగా కమిషనర్ బాలస్వామికి హామి ఇచ్చాడు. అనంతపురంకు స్మార్ట్‌సిటీ రాదని, విస్తీర్ణం తక్కువగా వుండడం వల్ల సాధ్యంకాదని, శివారు ప్రాంత పంచాయితీలను భవిష్యత్‌లో కలుపుకుంటే నగర విస్తీర్ణం పెరిగి భవిష్యత్‌లో అభివృద్ధి చెందడానికి వీలుంటుందన్నాడు. అలాగే ఆరు సర్కిల్స్‌కు గాను ఒకేఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్ రెగ్యులర్‌గా వున్నాడని, మిగిలిన వాటిల్లో ఔట్‌సోర్సింగ్ వాళ్లు వుండడం వల్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్ల పారిశుద్ధ్యంపై విమర్శలు వస్తున్నాయని, వారిని తొలగించి రెగ్యులర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఏర్పాటు చేస్తే బాధ్యతగా వ్యవహరిస్తారని లేకుంటే చర్యలు వుంటాయన్న ధోరణిలో విధులు నిర్వర్తించగలరన్నాడు. కార్మికులు ఉదయం 5.30గంటలకు వచ్చి 10.30 గంటలకు వెళ్లాల్సిండగా, 9గంటలకు లేకుంటే 9.30గంటలకే ఇంటిబాట పడుతున్నారన్నాడు. నీటిపన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా కార్పొరేటర్లు సైతం వారి వారి డివిజన్లలో సిబ్బందికి సహకరించి నీటిపన్ను చెల్లించేలా చూడాలన్నాడు. పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు, ఆర్ఓ ప్లాంట్లు, బస్‌షెల్టర్లు ఏర్పాటుకు ఎమ్మెల్యే ద్వారా ప్రతిపాదనలు వస్తే ఎంపి నిధులు మంజూరు చేస్తానన్నాడు. అలాగే నగరంలో మహనీయుల స్థూపాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఎంపి సూచించాడు. ఈ సమావేశంలో డిప్యూటి మేయర్ వాసంతి సాహిత్యతో పాటు డిప్యూటి కమిషనర్ డాక్టర్ డి.పావని, ఎస్ఈ రాజశేఖర్, ఈఈలు షాకీర్, చంద్రశేఖర్, డిఈలు సత్యనారాయణ, సుభాష్, వెంకటసుబ్బయ్య, ధనలక్ష్మి, ఏసిపి నీరజాక్షి, మేనేజర్ ఖయూమ్, ఇన్‌చార్జ్ ఆరోగ్య అధికారి బి.ఎల్.నరసింహా, రెవెన్యూ అధికారులు లక్ష్మిదేవి, విజయకుమార్‌తో పాటు కార్పొరేటర్లు, కోఆప్షన్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

- కౌన్సిల్ ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపి అంబికా, ఎంఎల్ఏ దగ్గుపాటి,హాజరైన కార్పొరేటర్లు

ప్రారంభమైన రాజగోపురముల శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు

❖ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ❖ కన్నుల పండువగా సాగిన నగర శోభాయాత్ర

అంతర్ చిత్రంలో కలశాలు

ఊరేగింపుగా వెళుతున్న ఉత్సవమూర్తులు

గుంతకల్లు, అక్టోబర్ 29 ప్రభాతవార్త

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో రాజగోపురముల శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. శిఖర కలశాలకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి పాల్గొన్నారు. ఉదయం వేద పండితులు శ్రీసీతారామ లక్ష్మణ సహిత నెట్టికంటి ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించారు. ప్రాతఃకాల ఆరాధన, పరిషత్ విజ్ఞాపన, రక్షాబంధనం, మృత్సంగ్రహణ, యాగశాల ప్రవేశం, గోపూజ, అగ్ని ప్రతిష్ఠ, రామాయణ, చతుర్వేద పారాయణములు, 18 కలశములకు పంచగవ్య స్వపనం, అర్చన, పూర్ణాహుతి, మంగళ శాసనంతో పాటు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రావణ మాసంలో ప్రసిద్ధిగాంచిన మురడి, నేమకల్లు, శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకోవడం భక్తులకు ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రధానంగా ఆంజనేయస్వామి ఆలయంలో రాజగోపురముల శిఖర కలశాల ప్రతిష్ఠ మూడు దశాబ్దాలుగా జరగలేదన్నారు. తన హయాంలో ప్రతిష్ఠ మహోత్సవాలు జరగడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా గోపురముల ప్రతిష్ఠ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

కన్నుల పండువగా సాగిన నగర శోభాయాత్ర :

పట్టణంలోని పాత గుంతకల్లు వద్ద వెలసిన ఆంజనేయస్వామి దేవాలయం నుండి నిర్వహించిన హనుమాన్ నగర శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర, రామాయణ, చతుర్వేద పారాయణములు, మహా కుంభ స్థాపన, ద్వారా తోరణ ధ్వజ కుంభారాధన, ఉప కుంభారాధనలు నిర్వహించారు. అగ్నిముఖము దిశగా 18 కలశాలు, ఉత్సవ మూర్తులను అశేష భక్త జనసంద్రం మధ్య ఊరేగించారు. చిన్నారుల వేషధారణ, మహిళల కోలాటం, గొరవయ్యల నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, తహశీల్దార్ రమాదేవి, అనువంశక ధర్మకర్త సుగుణమ్మ, కార్యనిర్వాహక అధికారి మేడేపల్లి విజయరాజు, ఆలయ అధికారులు వెంకటేశ్వర్లు, టిడిపి పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, మండల కన్వీనర్ రామన్నచౌదరి, నాయకులు బండారు ఆనంద్, తలారి మస్తానప్ప, బిజెపి నాయకులు శేఖన్న, కొలిమి రామాంజనేయులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రాజగోపురముల శిఖరం ప్రతిష్ఠ మహోత్సవాలు మూడు రోజులపాటు జరుగనున్నాయి.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే

శతజయంతి ఉత్సవాలకు పర్యాటకశాఖ నుండి రూ.10 కోట్లు మంజూరు

- నవంబర్ 10లోగా పనులను పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

శ్రీ సత్యసాయి జిల్లా, అక్టోబరు 29, ప్రభాతవార్త ప్రతినిధి

శ్రీ సత్య సాయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో రాష్ట్ర పర్యాటక శాఖ నుండి 10 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, నవంబర్ 10లోగా చేపట్టిన ఇంజనీరింగ్ పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ఇంజనీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్ పబ్లిక్ హెల్త్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, హెచ్ ఎం ఎస్ ఎస్ తదితర ఇంజనీరింగ్ శాఖల అధికారులతో పుట్టపర్తిలో శ్రీ సత్య సాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా చేపట్టిన పనుల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యాటక శాఖ ద్వారా మంజూరైన నిధులతో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఇప్పటికే చేపట్టిన పనులన్నింటిని నవంబర్ పదిలోగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆయా శాఖల ద్వారా ఎన్ని పనులు చేపట్టారు, మొత్తం ఖర్చు, ఇప్పటివరకు పూర్తయిన పని, ఇంకను చేయాల్సిన పని ఎంత, ఎప్పటిలోగా పూర్తి చేస్తారన్న నివేదికను తనకు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. చిత్రావతి నది ట్యాంక్ బండ్ పొడవునా సుందరీకరణ పనులు జరుగుతున్నాయని, అక్కడ వాచ్ అండ్ వార్డ్ ఉండాలన్నారు. పారిశుద్ధ పనులకు ఎంతమంది కార్మికులను తీసుకున్నారు, ఎన్ని ట్రాక్టర్లు ఏర్పాటు చేస్తున్నారు, త్రాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లు తదితరాలపై నివేదిక సమర్పించాలని పబ్లిక్ హెల్త్ శాఖను ఆదేశించారు. జల వనరుల శాఖ, హెచ్ ఎన్ ఎస్ ఎస్, ఆర్డబ్ల్యూఎస్ శాఖల ద్వారా చేపట్టిన పనుల ప్రగతిపై కూడా సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ఆర్ అండ్ బి ద్వారా చేపట్టిన పనులను కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. కాగా పర్యాటక శాఖ నుండి 10 కోట్ల రూపాయలను శతజయంతి ఉత్సవాల కొరకు మంజూరు చేయడం పట్ల పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తాము ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి మేరకు పర్యాటక శాఖ నుండి భారీ మొత్తంలో నిధులు మంజూరు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డిఆర్ఓ సుదర్శన్ రెడ్డి, సిపిఓ విజయ్ కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ నరసింహ, పిఆర్ ఎస్ఈ క్రాంతి, డిఆర్డిఏ పిడి నరసయ్య, వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 25 లక్షలు విరాళం హామీ

ఎంపీని సత్కరించిన బలిజ సంఘం

ఎంపిని సత్కరిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్ అక్టోబర్ 29 ప్రభాతవార్త

పట్టణంలోని లక్ష్మీపురం బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి హిందూపురం ఎంపీ పార్థసారధి ఎంపీ నిధులు రూ. 25 లక్షలు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు బలిజ కమిటీ సభ్యులు తెలిపారు. దీంతో సంఘం ప్రతినిధులు కృతజ్ఞతా పూర్వకంగా ఎంపి ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షులు వెంకటరమణ, కళ్యాణ మండపం అధ్యక్షులు ఎస్.ఆర్. మహేష్ కుమార్, విజయ్, ఆర్టీసీ రిటైర్డ్ జగదీష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రజిని, పాల విజయ్ పాల్గొన్నారు.

భగవద్గీతనే కించపరుస్తారా.. ఎమ్మెస్ రాజు వ్యాఖ్యలు సిగ్గుచేటు

వి.హెచ్.పి. ధ్వజం

హిందూపురం అక్టోబర్ 29 ప్రభాతవార్త

హిందూ సనాతన ధర్మానికి మూల స్తంభమైన భగవద్గీతను కించపరుస్తూ మడకశిర తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలను విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా ఖండించింది. విహెచ్పి సత్య సాయి జిల్లా అధ్యక్షులు రామకృష్ణ చౌదరి, కార్యదర్శి నరేంద్ర కుమార్, కోశాధికారి ప్రకాష్ రావు పత్రికా ప్రకటన విడుదల చేశారు. మడకశిరలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు చేసిన ఈ వ్యాఖ్యలు సిగ్గుచేటని విమర్శించారు. భగవద్గీత వేస్ట్ అని వ్యాఖ్యానించిన ఎమ్మెస్ రాజు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు డైరెక్టర్ గా పనిచేయడం ఏమిటని సూటిగా నిలదీశారు. భగవద్గీత ఏ ఒక్కరికో సంబంధించినది కాదని, సకల మానవాళికి దిక్సూచి అని వారు పేర్కొన్నారు. భగవద్గీత గురించి మాట్లాడే స్థాయి మీకు లేదు అని స్పష్టం చేశారు. హిందూ సమాజానికి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

గ్రామపంచాయతీ ఆదాయ వనరులపై శిక్షణా తరగతుల ముగింపు

శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్ అక్టోబర్ 29 ప్రభాతవార్త

గడచిన రెండు రోజులుగా కళ్యాణదుర్గం మండల పరిషత్ కార్యాలయం నందు నిర్వహించిన గ్రామపంచాయతీ ఆదాయ వనరులపై శిక్షణా తరగతులు బుధవారం ముగిసాయి మండలం పరిధిలోని గ్రామ సర్పంచులు గ్రామ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితర సిబ్బందికి స్థానిక కార్యాలయంలో రెండు రోజులపాటు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించామని ఎంపీడీవో ధనుంజయనాథ్ తెలిపారు స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయితీలలో ఆదాయ వనరుల పెంపొందించుకోవడానికి చింత ఫల సాయం అంగళ్ళ నిర్వహణ వారపు సంతల వేలం పాటు తదితర మార్గాలలో ఆదాయ వనరులను సమకూర్చుకోవచ్చు అన్నారు వాటిని ఎలా నిర్వహించాలో సిబ్బందికి సూచించారు ప్రభుత్వ నియమ నిబంధన మేరకు ప్రజాధనాన్ని వినియోగించాలని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఉంచాలన్నారు ఈ కార్యక్రమంలో డి ఎల్ డి ఓ నాగేశ్వరరావు ఈ ఓ ఆర్ డి రంగనాయకులు ఎంపీపీ మారుతమ్మ గ్రామ కార్యదర్శులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం మార్కెట్ యార్డ్ లో ప్రతివారం పశువుల సంత

ప్రతి శుక్రవారం గొర్రెల సంత శనివారం పశువుల సంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి

విలేకరులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోయ లక్ష్మీదేవి వైస్ చైర్మన్ రాజశేఖర్

కళ్యాణదుర్గం అక్టోబర్ 29 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డులో పశువులు, గొర్రెలు క్రయవిక్రయాల కోసం ఈనెల 31, శుక్రవారం నుండి ఏర్పాట్లు చేస్తున్నామని మార్కెట్ యార్డ్ చైర్మన్ బోయ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ కోనంకి రాజశేఖర్ తెలిపారు. బుధవారం మార్కెట్ యార్డ్ లో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల కిందట ఇక్కడ పశువుల సంత జరిగేదని, అయితే కాలక్రమేణ కనుమరుగైందని గుర్తు చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం నియోజకవర్గంలోని వ్యాపారులు, రైతులు పశువుల సంత నిర్వహణపై ఎమ్మెల్యే సురేంద్రబాబు దృష్టికి తీసుకు రావడంతో మార్కెట్ యార్డ్లో పశువులు, గొర్రెల సంత ఏర్పాటుకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈనెల 31న శుక్రవారం ఉదయం 7 గంటల నుండి క్రయవిక్రయాలు మొదలవుతాయని ఇందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శుక్రవారం గొర్రెల సంత, శనివారం పశువుల సంత ఉంటుందని రైతులు ఈవిషయాన్ని గమనించాలని సూచించారు. పావగడ, అనంతపురం, ఉరవకొండ తదితరప్రాంతాలకు వెళ్లి ఇక్కడిరైతులు పశువులు, గొర్రెలు అమ్ముకోవాలంటే రవాణాఖర్చులు తడిసి మోపెడవుతున్న నేపద్యంలో స్థానికంగానే మార్కెట్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. బెంగళూరు, హైదరాబాద్ నుంచి వ్యాపారస్తులు రప్పించడానికి ఏర్పాటు చేస్తామని తెలిపారు. పశువులు, గొర్రెల కోసం నీటి తొట్టెలు అందుబాటులో ఉంచామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కుబేర్ యాదవ్, ఇంచార్జ్ కార్యదర్శి శ్రీనివాసులు, సూపర్వైజర్ కేశవకుమార్, మండల కన్వీనర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్‌లో రూ.7 లక్షల విలువైన రాగివైరు చోరీ

సోలార్ ప్లాంట్‌లో చోరీ జరిగిన దృశ్యం

గుత్తి, అక్టోబర్ 29 ప్రభాతవార్త

పట్టణంలోని పారిశ్రామికవాడలో ఉన్న సోలార్ ప్లాంట్‌లో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని అగంతకులు ప్లాంట్‌లో చొరబడి దాదాపు 7 లక్షల రూపాయలకు పైగా విలువైన రాగివైరును చోరీ చేశారు. ఈ మేరకు టెక్నీషియన్ వెంకటరాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదేళ్లు కనిపించకుండా పోయి ఇప్పుడొచ్చి అభివృద్ధి అంటున్నావు నీకు ఇది తగునా...!

వైకాపా విమర్శలకు కౌంటర్ ఇచ్చిన టిడిపి నాయకులు

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కళ్యాణదుర్గం రూరల్ అక్టోబర్ 29 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం ప్రాంతంలో గత ప్రభుత్వ కాలంలో ఎంపీగా ఓటు వేసిన జనాలకు ఐదేళ్ళు కనిపించకుండా పోయి ఇప్పుడొచ్చి అభివృద్ధి గురించి మాట్లాడటం నీకు ఇది తగునా అంటూ వైకాపా సమన్వయకర్త రంగయ్యను ఉద్దేశించి కళ్యాణదుర్గం టిడిపి నాయకులు బుధవారం కౌంటర్ ఇచ్చారు స్థానిక మార్కెట్ యార్డ్ కార్యాలయం నందు ఏపీఎంసీ చైర్మన్ లక్ష్మీదేవితో పాటు వివిధ మండలాల కన్వీనర్లు పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఎంపీగా పనిచేసిన రంగయ్య ఏనాడు నియోజకవర్గ ప్రజలకు గాని ఆ పార్టీ కార్యకర్తలకు గాని అందుబాటులో లేకుండా పోయాడని దానికి కారణం కూడా ఆయనే చెప్పాలని సెలవిచ్చారు 2022 సంవత్సరంలో వాళ్ల ప్రభుత్వ హయాంలో నూతిమడుగు పెన్నా నది బ్రిడ్జ్ కొట్టుకుపోయిందని ఆ సమయంలో స్థానికంగా పనిచేసిన మంత్రి ఎంపీగా ఉన్న మీరు కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకుండా జనాలను వదిలేసారని తమ ప్రభుత్వం ఏర్పడ్డాక శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలన్న ఉద్దేశంతో తమ నాయకుడు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు 30 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు పనులు మంజూరైన వెంటనే చేపడతామని వివరించారు ప్రస్తుతం కంబదూరు పేరూరు మరియు వేపులపర్తి పోలేపల్లి కుందుర్పి జంబ గుంపుల గ్రామాల మధ్య కోట్లాది రూపాయల వ్యయం చేసి నూతన రహదారుల నిర్మాణం పనులు చురుకుగా సాగుతున్నాయని వీటితోపాటు కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో కూడా కోట్లాది రూపాయల పనులు జరుగుతున్నాయని కన్నెపల్లి గ్రామం వద్ద వేదావతి హగరి నదికి 30 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణ పనులు మంజూరయ్యాయని త్వరలోనే పనులను చేపడతామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అభివృద్ధికి చిరునామాగా కళ్యాణదుర్గం నియోజకవర్గం లో నిలుస్తాడని అభివృద్ధి అంటే అర్థం వివరిస్తారని తెలియజేశారు వీటన్నిటితో పాటు కళ్యాణదుర్గం ప్రాంత రైతులు ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న బి టి పి కాలువ పనులు చురుకుగా మూడు వైపులు నుండి సాగుతున్నాయని చెరువులకు నీళ్లు అందించి తీరుతామని గత ప్రభుత్వ హయాంలో ఒక్క అడుగు కూడా పనులు సాగలేదని మీలాంటి వాళ్లు మమ్ములను విమర్శించడం సిగ్గుచేటు అన్నారు. ఉన్నత విద్యావంతుడిగా రంగయ్య కు పేరు ఉందని అలాంటి వ్యక్తి. ప్రభుత్వంపై చౌకబారు విమర్శలు చేయడం ఆయన స్థాయిని తగ్గించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుబేర యాదవ్ రాజశేఖర్ రమేష్ కంబదూరు కుందుర్పి సెట్టూరు కన్వీనర్లు శివన్న ధనుంజయ టిఆర్ తిప్పేస్వామి తెలుగు యువత చటాకుల రాము తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సొంత ఆదాయ వనరులపై శిక్షణ

బ్రహ్మసముద్రం అక్టోబర్ 29 ప్రభాతవార్త

శిక్షణ పూర్తి చేసుకున్న దృశ్యం

బ్రహ్మసముద్రం మండల కేంద్రం నందు మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో "స్వంత ఆదాయ వనరులు అనే అంశం పైన రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఉమాదేవి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ శిక్షణా కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం ప్రతి గ్రామ పంచాయతీ తన స్వంత వనరుల చేత పరిపాలన కొనసాగించేటట్లు రాష్ట్ర మరియు కేంద్రం యొక్క గ్రాంట్ల మీద ఆధారపడకుండా స్వంత ఆదాయం సమకూర్చుకోవడం ఎలా అనే అంశం పైన పంచాయతీ కార్యదర్శులకు సర్పంచ్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి , డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖర్ కన్నేపల్లి పంచాయతీ కార్యదర్శి యోగేష్ శిక్షణను ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో ఆదాయ వనరులపై దృష్టి సారించండి

ఆదాయ వనరులపై అవగాహన కల్పించిన.... ఎంపీడీవో కమల భాయ్.

గోరంట్ల అక్టోబర్ 29 ప్రభాతవార్త

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో.

గోరంట్ల మండలంలోని 20 పంచాయితీలలో స్థానికంగా నెలకొన్న ఆదాయ వనరులపై దృష్టి సారించి ఆదాయాన్ని ఎలా సమకూర్చుకోవాలి ఎలా ఖర్చు పెట్టుకోవాలి అనే వాటిపై మండల ఎంపీడీవో కమల భాయ్ మండలంలోని సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం మండలంలోని సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాలకు సంబంధించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు డిజిటల్ అసిస్టెంట్ లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసే నిధులతోపాటు ప్రతి పంచాయతీ పరిధిలోని ఆదాయ వనరులను గుర్తించి వాటి ద్వారా లభించే ఆదాయంతో పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రచించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నిరంజన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు

కోతుల బెడద నుండి రక్షణ కల్పించండి

డి.హిరేహాళ్ అక్టోబర్ 29 ప్రభాతవార్త



తాసిల్దార్‌కి వినతిపత్రం ఇస్తున్న మహిళలు

కోతుల బెడద నుండి తమను రక్షించాలని బీసీ కాలనీ బయటి పేటకు చెందిన మహిళలు ఆ కాలనీకి చెందిన తెదేపా నాయకుడు మా కాశి వెంకటేశులతో కలిసి తహసిల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. బుధవారం డి.హిరేహాళ్ మండల కేంద్రంలోని చెందిన బిసి కాలనీ, ఎస్సీ కాలనీ ల మధ్య ఏర్పాటుచేసిన ఎయిర్టెల్ టవర్ ను కోతులు ఆశ్రయంగా చేసుకొని నివసిస్తున్నాయని దీంతో ఆ ప్రాంతంలో మేము తిరగలేకపోతున్నామని వారు వినిత పత్రంలో పేర్కొన్నారు. కోతుల బెడద నుండి తమను వెంటనే రక్షించాలని మహిళలు అనుమక్క, శాంతి, ఓబులమ్మ మరో 37 మందితో కలిసి వారు వినతి పత్రంను తహసిల్దార్ కు అందజేసి విజ్ఞప్తి చేశారు.

పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థుల..

స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అభినందనీయం

- ప్రాథమికోన్నత పాఠశాల కోనంపల్లి పాఠశాల ఉపాధ్యాయ బృందం

బెలుగుప్ప, అక్టోబర్ 29 ప్రభాతవార్త

పాఠశాల అభివృద్ధికి విరాళాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థుల.. స్వచ్ఛంద సంస్థలు

మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల కోనంపల్లి గ్రామం పాఠశాల పూర్వ విద్యార్థులు గూడూరు నరసింహప్ప కుమారులు గూడూరు హరికృష్ణ యాదవ్, గూడూరు శరత్ 50శాతం, ఎజిఎస్ శ్రీనివాస రెడ్డి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు ప్రమీలమ్మ, వారి కుమారుడు అనిల్ 50శాతం అనంతపురం వారు కోనంపల్లి పాఠశాల ఆరుబయట ముందు భాగంలో సుమారు రూ.1,60,000 వరండా పైకప్పు నిర్మించుటకు విరాళం ప్రకటించారు. వరండా పైకప్పు నిర్మాణంలో భాగంగా గూడూరు హరికృష్ణ యాదవ్ కుటుంబం మొదటి విడతగా రూ.50వేలు, ఎజిఎస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు ప్రమీలమ్మ మొదటి విడతగా రూ.70వేలు కోనంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందానికి చెక్కు రూపంలో అందజేశారు. వరండా నిర్మాణమునకు అయ్యే మిగిలిన ఖర్చు పని ప్రారంభం ముందుగానే చెల్లిస్తామని దాతలు తెలియజేశారు. కోనంపల్లి పాఠశాల బృందం పాఠశాలలో 8 తరగతులకు గాను కేవలం 4 శాశ్వత గదులు, రెండు తాత్కాలిక షెడ్లు మాత్రమే ఉన్నాయని (4 క్లాసులకు తరగతి గదులు లేవు) ఆ రెండు తాత్కాలిక షెడ్లు కూడా వర్షం వస్తే కారుతున్నాయని, ప్రస్తుతం 3వ, 4వ తరగతుల విద్యార్థులకు ఆరుబయట వరండాలో తరగతుల నిర్వహణ జరుగుతున్నదని వర్షం వస్తే ఆ రెండు క్లాసులు ఇతర క్లాసుల్లో క్లబ్ చేయాల్సిన పరిస్థితి, తరగతుల కొరతగల విషయాన్ని, మరీ ముఖ్యంగా విద్యార్థులు భోజనం ఆరుబయట చెట్ల కింద తింటున్నారని భోజన సమయంలో విద్యార్థుల ప్లేట్లలో చెట్ల ఆకులు, పుల్లలు రాలడం, వర్షం వచ్చినప్పుడు పిల్లలు భోజనం చేయడానికి ఇబ్బందికరంగా ఉంటున్నదని విద్యార్థుల సౌకర్యార్థం వరండా పైకప్పు నిర్మించదలిచామని అందుకు తగు సహాయం చేయవలసిందిగా పాఠశాల ఉపాధ్యాయులు దాతలను సంప్రదించగా వారు ఎంతో దయా హృదయంతో ఆరు బయట వరండా పైకప్పు నిర్మాణ కార్యక్రమానికి ముందుకు రావడం చాలా సంతోషదాయకం, గర్వించదగ్గ విషయం అని పాఠశాల ఉపాధ్యాయ బృందం తెలియజేశారు. పాఠశాల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి పాఠశాల ఆరుబయట వరండా నిర్మాణానికి 50 శాతం విరాళం ప్రకటించి పాఠశాల ఉపాధ్యాయ బృందానికి ప్రస్తుతం రూ.50000 చెక్కు అందజేసిన గూడూరు హరికృష్ణ యాదవ్ గారి కుటుంబానికి మరియు మిగిలిన 50 శాతం విరాళం ప్రకటించి ప్రస్తుతం 70000/ రూపాయల చెక్కును అందజేసిన ఎజిఎస్ ఫౌండేషన్ నిర్వాహకురాలు ప్రమీలమ్మకి వారి కుమారులు అనిల్కి కోనంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థి బృందం పక్షాన ధన్యవాదములు తెలియజేయజేశారు. పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థుల, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అభినందనీయం, ఆదర్శనీయమైనదని పాఠశాల ఉపాధ్యాయుల బృందం కొనియాడారు.

కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

కుందుర్పి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

వంకలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం దృశ్యం

కుందుర్పి మండలం వెంకటంపల్లి సమీపంలోని వంకలో ఉన్న విద్యుత్ స్తంభం కూలడానికి సిద్ధంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. వంక మీద రైతుల ప్రయోజనార్థం నిర్మించిన చెక్ డ్యాం లో సారవంతమైన మట్టిని రైతులు పొలాలకు తరలిస్తున్నారు. దీంతో విద్యుత్ స్తంభం చుట్టూ ఉన్న మట్టి తరిగిపోవడం వలన స్తంభం బలహీనపడి కూలిపోయే ప్రమాదం ఉందని పలువురు ప్రజలు వాపోతున్నారు. గతంలో విద్యుత్ శాఖ అధికారులు వంకలో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయడం వలన వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటి ఉధృతికి స్తంభం చుట్టూ నీరు చేరడంతో నీటి ప్రవాహానికి మట్టి కొట్టుకుపోవడం వలన ప్రమాదం మంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

తుఫాన్ కు తడిచిన వేరుశనగ

తుఫాన్ ప్రభావంతో రైతుకు నష్టాలు

బ్రహ్మసముద్రం అక్టోబర్ 29 ప్రభాతవార్త

మొంథా తుఫాన్‌కు తడిచిన వేరుశనగను చూపుతున్న రైతు

రాష్ట్రవ్యాప్తంగా మూంథా తుఫాన్ బీభత్సం రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే ప్రజలకు అనేక కష్టాలు తెచ్చిపెట్టిన మూంథా తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా సాగుచేసిన వివిధ పంటలపై ప్రభావం చూపుతూ రైతులకు అనేక నష్టాలు కలిగాయి మండలంలోని పడమటి కోడి పల్లి గ్రామంలో రైతుల సాగుచేసిన వేరుశనగ తొలగించే దశలో ఉండి రైతుల పంటను తొలగించిన రైతులకు మూంథా తుఫాన్ నిండాముంచింది వేరుశనగపంటను తొలగించినరైతులు గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిచి ముద్దయింది ఆరుగాలం శ్రమించి అధిక పెట్టుబడులు పెట్టి పంట కోసమే ఎదురుచూసిన రైతుకు నిరాశ కలిగింది అటు వేరుశనగతోపాటు మండల వ్యాప్తంగా కంది పంట సాగు వేల హెక్టార్లలో సాగు చేసిన రైతులకు నిరాశ కలిగించింది పోతదశలో ఉన్న కంది తుఫాన్ ప్రభావంతో పూతరాలిపోయిందని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు మూంథాతుఫాన్ ప్రభావంతో నష్టపోయినరైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వంఆదుకోకపోతే రైతులు మరింత అప్పులఊబిలో కూరుకుపోతారని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా రైతుల ఆవేదనను అధికారులు పట్టించుకోని రైతులకు న్యాయం చేస్తారా వేచి చూడాలి.



తుఫాన్ వల్ల తడిచిన వేరుశనగ

లింగమనహాళ్లి ని సందర్శించనున్న ఎమ్మెల్యే

డి.హిరేహాళ్ అక్టోబరు 29 ప్రభాతవార్త

తెదేపా మండల కన్వీనర్ మోహన్ రెడ్డి

ప్రభుత్వ విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డి.హిరేహాళ్ మండలాన్ని సందర్శించనున్నట్లు తెదేపా మండల కన్వీనర్ పాటిల్ మోహన్ రెడ్డి బుధవారం తెలిపారు. గురువారం సాయంకాలం డి.హిరేహాళ్ మండలంలోని లింగమనహాళ్లి గ్రామంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా రక్షిత త్రాగు నీటి కేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా పార్టీ శ్రేణులు, ఎంపీటీసీలు, యూనిట్ ఇంఛార్జిలు, బి.ఎల్.ఏ లు, అనుబంధ విభాగాల నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొనాలని మండల కన్వీనర్ కోరారు.

నేడు ఉరవకొండ పట్టణంలో పర్యటించనున్న ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

-మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజల అనంతరం మోదలుకానున్న కార్యక్రమం

ఉరవకొండ, అక్టోబర్ 29 ప్రభాతవార్త

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని వివిధ కాలనీల్లో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు ఆయన పట్టణంలోని పురాతన మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలోని వివిధ కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొంటారని తెలుగుదేశం పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అదేక్రమంలో పట్టణంలో ఇటీవల శ్రీకారం చుట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయనున్నట్లు సమాచారం.

భారీ వర్షాలకు చేనేతలకు జరిగిన నష్టానికి పరిహారం అందించి ఆదుకోవాలి

-మగ్గాలున్న చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలి -విలేఖరుల సమావేశంలో ఎంపీపీ, వైఎస్ ఎంపీపీ, వైఎస్సార్సీపీ నాయకులు

ఉరవకొండ, అక్టోబర్ 29 ప్రభాతవార్త

విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్సీపీ నాయకులు

తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు చేనేత మగ్గాలు నీట మునిగి, మగ్గం గుంతల్లో నీరు ఉబికి వస్తుండటంతో నష్టపోయిన ఉరవకొండ పట్టణంలోని చేనేత కార్మికులందరికీ పరిహారం అందించి ఆదుకోవాలని ఎంపీపీ ఎం.నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, వైఎస్సార్సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎం.బసవరాజు, పార్టీ రూరల్ మండల అధ్యక్షులు రాయంపల్లి ఎర్రిస్వామిరెడ్డి, జిల్లా చేనేత నాయకులు కరూరు వెంకటేష్, సోమా శేఖర్, చందా బాలాజీ, పురిడి వేణు, శంకర్ కోరారు. పట్టణంలోని స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. భారీ వర్షాలతో పట్టణంలోని ఇందిరానగర్, చౌడేశ్వరి కాలనీ, లక్ష్మీనరసింహ కాలనీ, 11, 1వ వార్డులు, చంగల వీధి, కుమ్మరి వీధి తదితర ప్రాంతాల్లోని చేనేత కార్మికుల ఇళ్లలోకి వర్షపునీరు చేరి మగ్గాలు నీటి మునిగి ముడి సరుకులు, చేనేత ఉత్పత్తులు పాడైపోయాయన్నారు. నేటికి అనేక కాలనీల్లో చేనేత మగ్గం గుంతల్లోకి వర్షపునీరు ఉబికి వస్తోందని దీంతో పనిలేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికార యంత్రాంగం జరిగిన నష్టంపై సమగ్రంగా నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపి పరిహారం అందేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మేరకు మగ్గాలు నేస్తున్న చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని పక్కాగా అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

అందులకు దారేది.....?

కళ్ళుండి అందుడికి దారి చూపని రైల్వే అధికారులు

గుంతకల్ రైల్వే డివిజన్ అధికారుల నిర్లక్ష్యం...

గుంతకల్ రైల్వే అక్టోబర్ 29 ప్రభాతవార్త..

అందులకు ఏర్పాటుచేసిన దారిని మూసివేసిన దృశ్యం



గుంతకల్ రైల్వే డివిజన్ కార్యాలయంలో ఉన్నత అధికారులు పరిపాలన సాగిస్తున్న ప్రయాణికుల సౌకర్యాలు కల్పించడంలో తీవ్రంగా విఫలమయ్యారు. అన్ని రైల్వే డివిజన్లో రైల్వే ప్లాట్ ఫామ్ లపై అందుల కొరకు . దివ్యాంగ్ లైన్ కోట్లు పెట్టి నిర్మాణాలు చేపట్టిన అందులకు వెళ్లడానికి దారులు మూసి వేశారు. రైల్లో ప్రయాణించడానికి దివ్యాంగులు రైల్వే ప్లాట్ఫారం నుంచి వివిధ ప్లాట్ ఫామ్ మీదకు వెళ్లడానికి ఇతరుల సహకారం లేకుండా వారుస్వయంగా వెళ్లవలసిన ప్లాట్ఫామ్‌కు దివ్యాంగులైన్ ఏర్పాటు చేశారు. డివిజన్లో రైల్వే అధికారులు ప్రతి నిత్యం రైల్వే స్టేషన్ కి వచ్చి వెళుతున్న కనిపించక లేకపోవడంతో దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ప్లాట్ఫారం వెళ్లాలంటే ఒకరి తోడు లేకుండా వెళ్లాలంటేనే భయంగా మారింది. అందుల కొరకు దివ్యాంగ్ లైన్ ను కేటా

03ATP29_03ATP29.qxd 29-10-2025 PM 11:13 Page 1

పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరం

బుక్కరాయసముద్రం అక్టోబర్ 29 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం పంచాయితీ పరిదిలోని కొట్టాలపల్లి గ్రామంలో ఈ నెల 31 న పశువుల్లో ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ ఏవి రత్నకుమార్ సహాయ సంచాలకులు ప్రాంతీయ పశువైద్యశాల బుక్కరాయసముద్రం వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఎదకు రాని పశువులకు అలాగే గర్భకోశ సంబందిత వ్యాధులకు ప్రత్యేక చికిత్స చేయబడును. పశువుల్లో లింగ నిర్ధారిత వీర్యంతో చూలు కట్టించడం వలన కేవలం ఆడ దూడలు పుట్టే పథకం గురించి వివరించండ జరుగుతుంది. ఈ అవకాశాన్ని బుక్కరాయసముద్రం, కొట్టాలపల్లి గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది. ఈ శిబిరానికి పశు సంవర్ధక శాఖ జేడీ, డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్స్, పశు వైధ్యాధికారులు పాల్గొంటారు అని తెలిపారు.

సొంత ఆదాయ వనరులపై సర్పంచులు, కార్యదర్శిలకు ముగిసిన శిక్షణ కార్యక్రమం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ భాస్కర్

శిక్షణ కార్యక్రమానికి హాజరైన సచివా లయ ఉద్యోగులు గ్రామ సర్పంచులు

శింగనమల, అక్టోంబర్ 29 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎంపి డిఓ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల సర్పంచులకు, కార్యదర్శిలకు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు పంచాయి తీల సొంత ఆధాయ వనర ఎలుఎలా సమకూర్చుకోవాలన్న దానిపై ఎంపిడిఓ భాస్కర్, డిప్యూటీ ఎంపిడిఓ విజయ్‌భా స్కర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ముగిసింది. శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు దేశంలో భాగా అభివృద్ధి చెందిన పంచా యితీలపై అవగాహన కల్పించడంతోపాటు పంచాయితీ ఆదాయ వనరుల సృష్టి వాటి వినియోగం, తదితర వాటిని వివరించారు. ఈ శిక్షణ కార్యక్ర మంలో తెలుసుకున్న విషయాలను గ్రామ స్థాయిలో అమలు చేసి పంచా యితీల అభివృద్ధికి పాటు పడాలని వారు పేర్కొన్నారు.

అధినేతను ఆహ్వానించిన తోపుదుర్తి కుటుంబ సభ్యులు

మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో తోపుదుర్తి కుటుంబ సభ్యులు

రాప్తాడు, అక్టోబర్ 29 ప్రభాతవార్త

నవంబరు 23న రాప్తాడు సమీపంలో జాతీయ రహదారి పక్కన హెచ్‌పి పెట్రోలు బంకు ఎదురుగా జరిగే వైఎస్సార్‌సిపి నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి కూతురు మోక్షిత- విష్ణుప్రి యారెడ్డి వివాహానికి వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదిం చాలని తమ అధినేత ను వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. బుధవారం తాడేపల్లిలో క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి దంపతులు, తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డిలు ఉన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టంను అందించిన పూర్వపు విద్యార్థులు

ప్రధానోపాధ్యాయురాలికి సౌండ్ సిస్టం అందజేస్తున్న పూర్వపు విద్యార్థులు

శింగనమల, అక్టోంబర్ 29 ప్రభాతవార్త

మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88, 10వ తరగతి చది విన విద్యార్థులు ఈ నెల 26వ తేది ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భ ంగా ప్రస్తుతం ఉపాధ్యాయులు పాఠశాలలో నెల కొన్న సమస్య లను పూర్వపు విద్యార్థుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి బుధవా రం రూ.65వేలు ఖర్చు చేసి పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించి, సౌండ్ సిస్టమ్‌ను ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆర్.మునెప్ప, సుధాకర్, చంద్రశేఖర్, రామకృష్ణరెడ్డి, రమణ, హరి ఉపాధ్యాయులు త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు బుక్కరాయసముద్రం ఎంపీపీ పై అవిశ్వాసం

బుక్కరాయసముద్రం, అక్టోబర్ 29 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం ఎంపీపీ దాసరి సునీత పై నేడు వైకాపా ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో మండలంలో రాజకీయాలు వేడెక్కాయి, మండలంలో మొత్తం 19 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 2021 లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో 14 మంది వైకాపా సభ్యులు, 5 మంది టిడిపి ఎంపీటీసీలు గెలుపొందారు. వైకాపాకు స్పష్టమైన మోజార్టి ఉండటంతో ఎంపీపీ పదవికి తీవ్రమైన పోటీ నెలకొంది, అప్పటి ఎమ్మెల్యే, వైకాపా నాయకులు ఒక తీర్మాణం చేశారు .మెదట ఎంపీపీగా కొనసాగేవారికి 2సంవత్సరాల పదవికాలం, రెండవసారి ఎంపీపీగా ఉండేవారికి 3సంవత్సరాలు పదవికాలంలో ఉండేలా నిర్ణయించారు. దీనికి ఒప్పుకొని మెదట దాసరి సునీత ను ఎంపీపీగా ఎన్నకున్నారు. రెండు సంవత్సరాల తరువాత సునీత ఎంపీపీ పదవికి రాజీనామా చేయకపోవడంతో రెండవ సారి ఎంపీపీగా ఎన్నిక కావాల్సిన కాలవ వెంకటలక్ష్మి సునీత ను రాజీనామ చేయాలని ఒత్తిడితెచ్చినా ఎంపీపీపదవికి రాజీనామ చేయకుండ ఎంపీపీగా పదవిలో కొనసాగినారు. ఎంపీపీ పదవి వెంకటలక్ష్మికి అప్పగించకపోవడంతో వైకాపా ఎంపీటీసీ సభ్యులు ఆందోళన చేశారు. 2024 ఎన్నికలు ముందు, ఎంపీపీ సునీత వైకాపానుండి టిడిపి లోకి చేరింది. రాజ్యాంగ నిబందనల ప్రకారం 4 సంవత్సరాలు వరకు అవిశ్వాసం పెట్టడానికి అవకాశం లేదు, ఎట్టకేలకు సెప్టెంబర్ 26 కి 4 సంవత్సరాలు పూర్తికావడంతో జడ్పీసీఈఓ, జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓకు అవిశ్వాసం పెట్టాలని మెజార్టీ వైకాపా ఎంపీటీసీలు నోటీసులు అందజేశారు. సంబందిత అదికారులు ఎట్టకేలకు ఈ నెల 30 అవిశ్వాసం పెట్టడానికి అనుమతి ఇచ్చారు. అవిశ్వాస తీర్మానం వీగిపోవాలంటే 13 మంది సభ్యులు మద్దతి కావాలి, వైకాపా ఎంపీటీసీ సభ్యులు 13 మంది ఉండగా అందులో 12 మంది క్యాంపులకు వెల్లినట్లు సమాచారం అందులో 3వ వైకాపా ఎంపీటీసీ సభ్యరాలు శిరీష క్యాంపునకు గైర్హాజరయ్యారు. టిడిపి ఎంపీటీసీ సభ్యులుకూడ 5మంది క్యాంపులకు తరలినట్లు సమాచారం. నేడు అవిశ్వాసం ఎవరికి మద్దతు ఇస్తారో అని మండలంలో చర్చలు జరుగుచున్నాయి.

జనసేనపార్టీలో నాగబాబు ఒక పవర్ సెంటర్

- ఆపార్టీ నాయకులు కత్రిమల సుబ్బు వెల్లడి - జనసైనికుల మధ్య ఘనంగా నాగబాబు జన్మదినోత్సవ వేడుకలు

పామిడి, అక్టోబర్ 29 ప్రభాతవార్త

జనసేనపార్టీలో ప్రధాన కార్యదర్శిగా ఒక పవర్ సెంటర్‌గా ఎదిగిన ఎమ్మెల్సీ నాగబాబు పార్టీలోని సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించట ంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని ఆపార్టీ కత్రిమల సుబ్బు పేర్కొన్నారు. జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సోదరుడు ఎమ్మెల్సీ నాగబాబు జన్మోదినోత్సవాన్ని పురష్కరించుకుని ఆపార్టీ నాయకులు కత్రిమల సుబ్బు ఆద్వర్యంలో బుధవారం పట్టణంలోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టిన జనసైనికులు కేక్‌ను కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. ఈసందర్భంగా కత్రిమల సుబ్బు మాట్లాడుతూ అధినేత పవన్‌కళ్యాణ్‌కు స్వయాన సోదరుడైన నాగబాబు ఏరోజూ పార్టీపై తన వ్యక్తిగత పెత్తనాన్ని చెలాయించిన దాఖాలాలు లేవన్నారు. అద్యక్షుల వారి అదేశాల మేరకే పార్టీలో పని చేస్తున్నానని మొదటి నుండి చెప్పుకుంటూ వస్తున్న నాగబాబు అనేక రకాలపై వత్తిళ్ళు, ఇబ్బందులను ఎదుర్కొంటూ అధినేత పవన్‌కళ్యాణ్ వద్దకెళ్ళలేని వారందరికీ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారని తెలిపారు. న్యాయ విద్యను అభ్యశించిన నాగబాబు రాజ్యాంగ పరమైన విషయాలను సమకాలిన సా మాజిక పరిస్థితులపై అద్యా య నం చేస్తూనే ఉంటారని రాజకీ య విషయాలలో చక్కటి అవగా హణ, పరిజ్ఞానం ఉన్నటు వంటి ఆయన జనసేనపార్టీ ప్రధాన కార్యదర్శిగా పార్టీని మరింత బలోపేతం

ఎమ్మెల్సీ నాగబాబు జన్మదినోత్సవ కేక్‌ను కట్ చేస్తున్న కత్రిమల సుబ్బు.

చేయటంలో అటు అధినేతకు ఇటు జనసైనికు లకు మార్గనిర్దేశం చేస్తున్నారని తెలియ జేశారు. పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తూ జనసైనికుల సంక్షేమానికి పాటుపడుతున్న ఎమ్మెల్సీ నాగబాబుకు దేవుడు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమం లో జనసే నపార్టీ నాయకులు అడ్వకేట్ సతీష్, వడ్డే రాము, లాలుస్వామి, షేక్షావలి, ఖాజా, జమీర్, లక్ష్మన్, సూర్య తదితరు లు పాల్గొన్నారు.

కురుగుంట గ్రామంలో ఎన్.ఎస్.ఎస్ స్పెషల్ క్యాంప్

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 29 ప్రభాతవార్త

అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) విద్యార్థుల ఎన్.ఎస్.ఎస్ స్పెషల్ క్యాంప్ కురుగుంట గ్రామంలో రెండవ రోజు విజయవంతంగా నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం. విష్ణుప్రియ తెలియజేశారు. రెండవ రోజు విద్యార్థులు బృందాల వారీగా ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వీటిలో ప్రధానంగా సీజనల్ వ్యాధులు, పోషణ అభియాన్, సూపర్ జి.ఎస్.టి 2.0, సైబర్ సెక్యూరిటీ, పర్యావరణ అవగాహన, పునర్వినియోగ శక్తి వనరుల వినియోగం వంటి అంశాలపై ప్రజలకు వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జూలజీ విభాగం అధ్యాపకులు, ఆర్.ఆర్.సి-ఐ.ఆర్.సి.ఎస్ సమన్వయకర్త, గిరిధర్, బోటనీ విభాగం అధ్యాపకురాలు, ఎన్.ఎస్.ఎస్ యూనిట్-2 ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.విష్ణుప్రియ, కురుగుంట అం బేద్కర్ గురుకులం బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వ హి ంచారు. ఈ కార్యక్రమంలో పోష ణ అభియాన్, దీర్ఘ కాలిక వ్యా ధుల నివారణ, మై భారత్ పోర్ట ల్, ఎన్.ఎస్.ఎస్ సేవా ప్రా ముఖ్యత వంటి అంశాలపై వి

మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.విష్ణుప్రియ

ద్యార్థినులకు విస్తృతమైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని సేవా స్ఫూర్తిని ప్రదర్శించారు.

వ్యవసాయ అధికారులతో జెడి ఉమామహేశ్వరమ్మ సమావేశం

అనంతపురం కలెక్టరేట్ అక్టోబర్ 29 ప్రభాతవార్త

అనంతపురం నగరంలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో బుధవారం సమావేశ మందిరం యందు సహాయ వ్యవసాయ సంచాలకులతో మరియు మండల వ్యవసాయ అధికారులతో జిల్లా వ్యవసాయ అధికారి యు, ఉమామహేశ్వరమ్మ అధ్యక్షతన రబీ 202526 సంసిద్ధత పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం యందు రబీ 2025 26 సీజన్ కి సంబంధించిన సాగు విస్తీర్ణం గురించి చర్చించారు, అలాగే ఎరువుల నిల్వలు పంపిణీ సంబంధించిన అంశాలపై డీలర్ స్థాయిలో ఐఎఫ్ ఎం ఎస్ ద్వారా ఎప్పటికప్పుడు అమ్మకాలను నమోదు చేసే విధంగా చూసుకోవాలని ఆదేశించారు. రాబోయే నాలుగు రోజుల్లో తుఫాన్ హెచ్చరికలు ఉండటం వలన క్షేత్రస్థాయిలో రైతులను అప్రమత్తం చేసి పంటలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా నీటి నిల్వ వలన పంటలు నష్టపోకుండా తగిన జాగ్రత్తలు చేయాలని ఆదేశించడం జరిగింది. రబీ 202526 కి పంటల భీమా సంబంధించి రైతులలో అవగాహన కల్పించి సాగు చేసే పంటలకు భీమా చేయించుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే పంట కోత ప్రయోగాలను తప్పనిసరిగా తనిఖీ చేసి అంత కోత ప్రయోగాల అప్లికేషన్ ద్వారా నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని శిలీదీదీర్క్ పీఎం డిడి కె వై కి సంబంధించిన వ్యవసాయ శాఖ సంబంధించి కార్యచరణ ప్రణాళికను తయారుచేసి పంపించాలన్నారు. ఈ పంట ఖరీఫ్ 202526 కి సంబంధించి ఇప్పటివరకు జిల్లాలో 19,11,943 ఎకరాలు కి ఇప్పటి వరకు 15,53,664 ఎకరాలు 81 నమోదు అయ్యాయని అలాగే 9,63,823 ల్యాండ్ పార్సెల్‌కి ఇప్పటి వరకు 7,94,141 ల్యాండ్ పార్సెల్ 82 పూర్తి చేశామని అలాగే పంటల సంబంధించి వ్యవసాయ, ఉద్యానవన మరియు ఇతర పంటలుకలపి 10,64,594 ఎకరాలు పూర్తి అయ్యాయన్నారు. మిగలిన విస్తీర్ణం లో సాగు చేయలేదని తెలియజేస్తున్నా. ఇంకా సాగు చేయనటువంటి భూమి వివరాలు గుర్తించే విధంగా అప్లికేషన్ యందు ప్రత్యేక సదుపాయాన్ని కల్పించడం జరిగింది. దీనిని ఉపయోగించి మిగిలిన విస్తీర్ణం పూర్తి చేస్తామని తెలియ జేస్తున్నాము. అలాగే ఇంకా పంటలను నమోదు చేయడానికి ఈనెల 30 తేది వరకు గడువు

వ్యవసాయ అధికారు తో సమావేశం నిర్వహించిన జెడి ఉమా మహేశ్వరమ్మ

ఇవ్వడం. కాబట్టి రైతు తెలియజేసి మిగిలిన విస్తీర్ణం నమోదు చేయవలసిందిగా ఆదేశించడం జరిగింది. ఈ సంవత్సరం పత్తి కొనుగోలు సంబంధించి కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. అలాగే ఈ పంట ఆధారంగా కొనుగోలు చేయడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆదేశాల మేరకు కాపాస్ కిసాన్ అప్లికేషన్ ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా విధి విధానాలను తెలియజేశారు. ఇదే సందర్భంలో గురువారం నుండి జిల్లా నందు సబ్సిడీ పప్పు చెన్నిగ కొరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. పూర్తి ధర క్వింటాలకు 7800 కాగా సబ్సిడీ పోను 5850 చెల్లించవలసి ఉంటుందని ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి సహాయ ఏడి మార్కెటింగ్, డిఎం ఏపీ మార్కుఫెడ్, వ్యవసాయ సంచాలకులు , మండల వ్యవసాయ అధికారులు మరియు జిల్లా వ్యవసాయ కార్యాలయంలో పనిచేసే సాంకేతిక వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి మహాప్రభో

టిడిపి నాయకులపై నెపంమోపుతున్న పంచాయితీ కార్యదర్శులు

ఆత్మకూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త

గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం వెంచించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని సర్పంచులు పంచాయితీ కార్యదర్శులను డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లో స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్, కేంద్ర ప్రభుత్వ నిధులు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు, వెనుకబడిన ప్రాంత అభివృద్ధి నిధులు, ప్రత్యేక అభివృద్ధి నిధులు మరియు ఇతర మార్గాల ద్వారా సర్పంచులకు పెండింగ్ బిల్లులు రావాల్సి వుంది. మండలంలో 17 పంచాయితీలు అందులో 25గ్రామాలు ఉన్నాయి. గ్రామాలల్లో కార్యదర్శులు, సర్పంచులు ఇద్దరు సమస్వయంతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు అమలు వంటికి ఇరువురు కలిసి గ్రామాభివృద్ధి సాగించవలసిన వారు రాజకీయ నాయకుల మాటలకు విలువ ఇస్తూ కార్యదర్శులు సర్పంచుల బిల్లులు పెండింగ్‌తో మండలంలో గల గ్రామాల్లో అభివృది ధ్ధికి అట్టకంగా మారుతుందనే విమర్శలు వినిపిస్తూన్నాయి.

గ్రామ సమస్యలపై పరిష్కరణకు స్పందించక నిర్లక్ష్య ధోరణిగా కార్యదర్శులు వ్యవహరిస్తున్నారని సర్పంచులు మండిపడుతున్నారు. గ్రామాభివృద్ధి కోసం చేసిన పనులకు బిల్లులు చేయాలని కార్యదర్శుల వద్దకు వెళ్లితే మండల స్థాయి టిడిపి నాయకుడు మాకు తెలియకుండా బిల్లులు చేయొద్దండని చెబుతున్నారని కార్యదర్శులు చెప్పుతు న్నారని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తపరుస్తూన్నారు. కార్యదర్శుల తీరుతో వైసీపీ మద్దతుదారు సర్పంచ్ నియోజకవర్గ ప్రముఖ ముఖ్య టిడిపి నాయకుడుకి ఫోన్ ద్వారా స ంప్రదించి అన్నా మా పరిస్థితి ఇదే అని తెలుపుగా రాజకీయాలతో సంబంధం లేదు గ్రామాల అభివృద్ధే ముఖ్యమని సమస్వయంతో అభివృద్ధి చేసుకోవాలని సానుకూలంగా ముఖ్యనాయకుడు చెప్పాడు,

అయితే కార్యదర్శుల మాత్రం స్వాలాభం కోసం టిడిపి పార్టీ నాయకుల పేర్లను వాడుకొని మాపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సమంజం కాదని సర్పంచులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. మండలంలో గల ఒక గ్రామ సర్పంచు చేసిన పనులకు సంబంధించిన రికార్డులు తయారు చేయమని పంచాయితీ అధికారిని వేడుకోగా ఆ అధికారి నిర్లక్ష్య ధోరణి అసహనం వేసిందని ఒక సర్పంచ్ ఆవేదన వ్యక్తంచేశారు. మండల స్థాయి టిడిపి నాయకుడు తమదే జరిగాలనే నిరంకుశ ధోరణే గ్రామ అభివృద్ధికి అట్టంకంగా మారుతుందే విమర్శులు వినిసిస్తూన్నాయి. దీనిని ఆసరా చేసుకున్న కార్యదర్శులు సర్పంచులకు గ్రామాభివృద్ధికి సహకరించలేదనే విమర్శులు వినిపిస్తూన్నాయి. అధికారులు గ్రామాభివృద్ధికి సహకరించాలని గ్రామ సర్పంచులు కోరుతున్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే పరిటాల సునీత ఉన్నతాధికారులు నిర్లక్ష్యధోరణితో వ వ్యవహరించే పంచాయితీ కార్యదర్శులపై చర్చలు తీసుకోవాలని సర్పంచులు కోరుతున్నారు.

రైతులను నష్ట కష్టాలపాలు చేసిన భారీ వర్షాలు..!

పక్షం రోజుల పప్పుశెనగ పంట నీట మునిగి కుళ్లిపోయిన దృశ్యం

పంట కనబకుండా పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిన పప్పుశెనగ పొలం

(మొదటి పేజీ తరువాయి) సాగు కావాల్సి ఉండగా 11,395 హెక్టార్లలో పంట సాగైంది. జూన్‌లో సాగైన పంట కోతలు ఇదివరకే పూర్తి కాగా జూలై రెండో వారంలో బోర్లు, బావులు, కాలువల క్రింద సాగైన వేరుశెనగ పంట కోతలు ఇటీవల రైతులు చేపట్టగా పంటను కుప్పలుగా పోసి పొలాల్లోనే ఆరబెట్టుకుంటున్నారు. అయితే తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో మండలంలోని చిన్నముష్టూరు. ఇంద్రావతి, మోపిడి, నింబగల్లు, రాయంపల్లి, నెరమెట్ల తదితర ప్రాంతాల్లో పంట మోత్తం తడిసిపోయి వేరుశెనగ కాయలు మొలకలొస్తుండగా, కనీసం పశువులకు మేత కూడా దక్కకుండా కట్టె మోత్తం నల్లగా మారే పరిస్థితులు నెలకొన్నాయి. పప్పుశెనగ పంట విషయానికొస్తే డివిజన్‌లో రబీ పంట కాలంలో 26,077 హెక్టార్లలో పంట సాగు కావాల్సి ఉండగా ప్రభుత్వం రాయితీ విత్తనం అందించకపోవం తదితర కారణాలతో ఇప్పటి వరకు కేవలం 6,500 హెక్టార్లలో పంట సాగైంది. పక్షం రోజుల వయసుగల పంట ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుళ్లిపోయి పూర్తిగా దెబ్బతిని అనేక చోట్ల తుడిచిపెట్టుకొనిపోగా మరికొన్ని చోట్ల సగానికి సగం పంటకు నష్టం వాటిల్లింది. బంగాళాఖాతంలో అల్పపీడనాలు, వాయుగుండం ప్రభావంతో తుఫాన్లు ఒకదాని తరువాత మరొక ఏర్పడి భారీ వర్షాలు కురుస్తుండటంతో పెట్టుబడులతోపాటు దిగుబడులను సైతం నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేయించి పరిహారం అందించడంతోపాటు పప్పుశెనగ, ఇతరత్రా ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ఉచితంగా అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

పంట కోతలు వాతావరణ హెచ్చరికలు దృష్టిలో పెట్టుకొని చేపట్టాలి:

రైతులు వాతావరణ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకొని వేరుశెనగ, కంది, మొక్కజొన్న, వరి, జొన్న పంట కోతలు చేపట్టాలని ఉరవకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.సత్యనారాయణ తెలిపారు. ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడారు. వాయుగుండాలు, అల్పపీడనాలు ఉన్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పంట కోతలు చేపట్టవద్దన్నారు. నిబంధనల మేరకు పంట కోసిన తరువాత తడిసిన ఓదెలకు, ధాన్యానికి ప్రభుత్వం ద్వారా ఎటువంటి పంట నష్టపరిహారం రాదని ఈ విషయాన్ని రైతులు దృష్టిలో పెట్టుకోవాలని కోరారు.

జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 31న ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలో ఐక్యతా ర్యాలీ

ధర్మవరం, అక్టోబర్ 29(ప్రభాతవార్త)

భారతదేశపు ఉక్కుమనిషి, జాతి సమైక్యతకు ప్రతీక అయిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ గారి 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని, ఈ నెల అక్టోబర్ 31వ తేదీన దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించబడనుంది. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయ ఐక్యతా ర్యాలీల లో భాగంగా, సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో కూడా ఈ కార్యక్రమం వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా ధర్మవరం పట్టణంలో జాతీయ ఐక్యతా ర్యాలీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 31వ తేదీ ఉదయం ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హరీష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరుకానున్నారని అన్నారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ .... సర్దార్ వల్లభభాయ్ పటేల్ భారతదేశాన్ని ఏకం చేసిన మహానేత. ఆయన దేశ సమైక్యత, ఐక్యత, అఖండతకు అంకితమైన జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకం. ఆయన స్ఫూర్తితో నడవాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ధర్మవరం ప్రజలంతా ఈ ర్యాలీలో చురుకుగా పాల్గొని జాతీయ ఐక్యతకు తమ మద్దతు తెలియజేయాలి, అని తెలిపారు...దేశ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన పటేల్ జయంతి సందర్భంగా జరగబోయే ఈ ఐక్యతా యాత్రలో మన యువతరం దేశ భక్తి, ఐక్యతా భావాలను మరింతగా బలపరుచుకోవాలి. రాజకీయాలకు అతీతంగా నిర్వహించబడుతున్న ఈ జాతీయ ఐక్యతా కార్యక్రమంలో ధర్మవరం ప్రజలందరూ, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, పుర ప్రముఖులు, సామాజిక సేవకులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని హరీష్ బాబు పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న బిజెపి నాయకులు హరీష్ బాబు

పబ్లిక్ నోటీస్
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
(ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చట్టం, 1974 సెక్షన్ 25)
రిజిస్టర్ నెం. ABC.CS/006/2015
H.O.ABCCS Environmental Commissionerate Campus Gollapudi, Vijayawada-521225 Ph 0866- 2413524/655300
B.O.ABCCS, #3-105, Ground Floor, 2nd Road, Gangappa, ANANTHAPURAMU - 515 001. Ph. 08554-224742

క్ర.సం	పేరు	వివరాలు
1.	Theriyur Narasimha murthy Lakshmikantha Rao S/o. Teriyur Narasimha GL.No. A-94925 D.no. 11-9-6, Kota, Near It Town Police Station, Hindupur - 515201 Ph.no.9951247427/ 9849171275	The property an extent of 123.00 Sq yards of house site along with RCC roofed ground floor (under construction / semi finished) residential building therein, in Sy.no.278-1. As per Sub Division Sy.no. 278-1A, Near D.no. 24-4-43, Ward no. 24, Near by Balaji Vidya Vihar, Vidhya Nagar, Hindupur Municipality, Hindupur, Sri Satya Sai District. Value Rs. 26.40 lakhs.

తేది: 29-10-2025
సం/- పి. బాబు
ప్రాంతీయ అధికారి,
9849874742, 9281029472

04ATP29_04ATP29.qxd 29-10-2025 PM 11:16 Page 1

'ప్రజా దర్బార్'లో వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు

- రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్
- తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన మంత్రి

ప్రజలతో సమస్యలపై ఆరా తీస్తున్న రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

మంత్రిలో మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ గుర్రం సుధాకర్

మంత్రికి సమస్యలు తెలియజేస్తున్న వివిధ గ్రామాల ప్రజలు

ఉరవకొండ, అక్టోబర్ 29 ప్రభాతవార్త

ప్రజా దర్బార్ కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటానని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని రామ్‌నగర్‌లోగల తన క్యాంపు కార్యాలయంలో బుధవారం మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిం చిందని తమ ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమ రెండు కళ్ళు లాంటివన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసి రాష్ట్రానిన ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడం జరుగుతోందన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు, వివిధ పార్టీల నాయకుల సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించారు. ఎలాంటి ఆలస్యం లేకుండా సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు.

పిఏబిఆర్ కుడి కాలువ కింద చివరి చెరువు వరకు నీరందాలి

- హంద్రీనీవా నుంచి లింక్ కాలువ గురించి ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- పీఏబిఆర్ అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

పీఏబిఆర్ అధికారులతో మాట్లాడు తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అనంతపురం, అక్టోబర్ 29 ప్రభాతవార్త బ్యూరో

పిఏబిఆర్ కుడి కాలువ కింద ఈసారి చివరి చెరువుకు కూడా నీరు అందించాలని అధికారులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. అనంత పురంలోని తమ క్యాంప్ కార్యాలయంలో పీఏబిఆర్ జలాశయం ఎస్ఈ, ఈఈ, ఏఈ తదితరులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సారి జలా శయంలోకి నీరు ఎంత మేర రావచ్చు, ఎన్ని చెరువులకు నీరు అందిం చవచ్చ న్నది ఆరా తీశారు. కుడికాలువ పరిధిలో రాప్తాడు, ధర్మవరం నియోజ కవ ర్గాలు ఉన్న నేపథ్యంలో దానిపై సుదీర్ఘంగా చర్చించారు. తాడి మర్రి మం డలంలోని చివరి చెరువు వరకు ఈసారి నీరందాలన్నారు. ప్రతి సారి నీరు వస్తుందన్న ఆశతో రైతులు పంటలు సాగు చేసి నష్టపోతున్నారన్నారు. లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలకు నీరు అందక నష్టపోవడం సరికాదన్నారు. రైతులకు ఈ సారి కచ్చితంగా నీరు అంది స్తామని చెప్పా మని.. ఎట్టి పరిస్థితుల్లో నీరు అందించి తీరాలన్నారు. సుమారు 115 కిలో మీటర్ల మేర కాలువ ఉన్న నేపథ్యంలో నీరు సరి పోక పోతే..ఈ కాలువకు సమీపంలో హంద్రీనీవా కాలు వ ఉంటుందన్నారు. అక్కడి నుంచి లింక్ కాలువ ఏర్పాటు చేస్తే కింది ప్రాంతాలకు నీరు అందించవచ్చన్నారు. ఆ దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ సూచించారు.

బోగస్ ఎన్రోల్మెంట్ తొలగించండి

- 15 నుండి 20 రోజులు స్కూల్స్‌కు రాని విద్యార్థుల వివరాలు పంపించండి - జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశం - బ్రహ్మసముద్రం ఎంఈఓ 1, 2లకు మెమోలు జారీ

వార్త ప్రభావం

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 29 ప్రభాతవార్త

జిల్లాలో 1846 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు చదువుతున్న 2,09,253 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఇందులో 23 శాతం మంది విద్యార్థులు గత వారం రోజులుగా పాఠశాలలకు రాకపోవడం లేదు. సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు ఫోటో మంత్రంగా పర్యవేక్షణ చే స్తూ నిర్లక్ష్యం చేస్తున్నడంపై ఈనెల 28వ తేదీ వార్త దినపత్రికలో ఆ విద్యార్థులు పాఠశాలల్లో ఉన్నట్లా...లేనట్లా? అనే శీర్షికతో కథనం ప్రచురితం అయింది. ఇందుకు జిల్లా కలెక్టర్ల ఓ.ఆనంద్ స్పందించారు. దీనిపైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ను ఆదేశించారు. పాఠశాలలను తనిఖీలు చేసి వెంటనే బోగస్ ఎన్రోల్మెంట్ ను తొలగించాలని, అదేవిధంగా పాఠశాల పని దినాల్లో వరుసగా 15 రోజుల నుండి 20 రోజుల వరకు పాఠశాలలకు రాణి విద్యార్థుల వివరాలను పంపించాలని ఆదేశిస్తూ మండల విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. ప్రసాద్ బాబు తెలిపారు.

బ్రహ్మసముద్రం ఎంఈఓ 1, 2 లకు మెమోలు జారీ : బ్రహ్మసముద్రం మండలం గొంచిరెడ్డిపల్లి యూపీ స్కూల్‌లో బోగస్ ఎన్రోల్మెంట్ ను తొలగించాలని కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు స్థానిక మండల విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ.. పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిన ఘటనలో ఆ స్కూల్ ఉపాధ్యాయుడు (హెచ్ఎం) సస్పెండ్ అయ్యారు. ఇదే ఘటనలో మండల విద్యాశాఖ అధికారికి-1 ఓబుళపతి, మండల విద్యాశాఖ అధికారికి-2 క్రిష్ణ నాయక్ లకు మంగళవారం మెమోలు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. వారు గడువులోపు ఇచ్చే వివరణను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా కొణిదెల నాగబాబు జన్మదిన వేడుకలు

అహుడా చైర్మన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నాగబాబు జన్మదిన వేడుకును నిర్వహించుకుంటున్న అభిమానులు

అనంతపురం అక్టోబరు29 ప్రభాతవార్త

జనసేనపార్టీ పిఏసి సభ్యుడు, శాసనమండలి సభ్యుడు, మెగా అభిమానుల రథసారథి కొణిదెల నాగబాబు జన్మదిన వేడుకను కేక్ కట్ చేసి అభిమానులు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎస్-2 థియేటర్ వద్ద అనంతపురం జనసేన పార్టీ, రాష్ట్ర చిరంజీవి యువత ఆధ్వర్యంలో జన్మదిన వేడకను నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టి.సి.వరుణ్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ రా ష్ట్ర డైరెక్టర్ భవానికుమార్, జనసేన పార్టీ నాయకుడు, మెగా అభిమానుల రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు అంగడి చలపతి, రామ్‌చరణ్ అధ్యక్షుడు హుస్సేన్, అభిమాన సంఘం నాయకులు వెం కట నారాయణ, లక్ష్మీప్ర సాద్, జె.కె.రమేష్, ఛోటు, చిన్న, విజయసాయి, వరుణ్, రోల్ భాస్కర్, మాధవ, ధరజ్ బాష, వీర మహిళ నాయకులు అనసూయ, శైలజ, శరణ్య, మంజుల, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈపంటపై సామాజిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్

ఈ పంటపై సామాజిక తనిఖీ నిర్వహించిన కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ అక్టోబర్ 29 ప్రభాతవార్త

ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సూపర్ చెక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం అనంతపురం రూరల్ మండలంలోని తాటిచెర్ల గ్రామం పరిధిలో ఈ క్రాప్ బుకింగ్ సూపర్ చెక్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా అనంతపురం రూరల్ మండలంలోని తాటిచెర్ల గ్రామం పరిధిలో పి.రామగోపాల్ చెందిన సర్వే నంబర్ 308/3ఏలోని 2.74 ఎకరాల పొలంలో దానిమ్మ పంట సాగు చేయగా, ఈ క్రాప్ బుకింగ్ లో జిల్లా కలెక్టర్ సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం పి.సుదర్శనాచారి కి చెందిన సర్వే నంబర్ 320/1బిలోని 1.07 ఎకరాల పొలంలో నిమ్మ పంట సాగు చేయగా, ఈ క్రాప్ బుకింగ్ లో జిల్లా కలెక్టర్ సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే నంబర్లు, పంటల సాగు, విస్తీర్ణం, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ లో సామాజిక తనిఖీ పక్కాగా నిర్వహించాలని సంబంధిత అది .కారులను ఆదేశించారు. సామా జిక తనిఖీ సకాలంలో పూర్తి చే యాలన్నారు. ఈ కార్యక్రమ ంలో ఏడీఏ అల్తాఫ్ అలీ ఖాన్, తహసిల్దార్ మోహన్ కుమార్, ఏవో వెంకట కుమార్, ఉద్యాన అధికారి రత్న కుమార్, విహెచ్ఏ గంపరాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆత్మీయ సమావేశానికి పెద్ద ఎత్తున తరలిరండి - పోతుల సురేష్

మాట్లాడుతున్న బిజెపి నాయకుడు పోతుల సురేష్.

రొద్దం. అక్టోబర్ 29 ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి కేంద్రంలో ప్రజా ఆత్మీయ సమావేశానికి నవంబర్ 9 వ తారీఖున పెద్ద ఎత్తున తరలిరావాలని మండల వ్యాప్తంగా బిజెపి కార్యకర్తలు నాయకులకు బిజెపి నాయకుడు పోతుల సురేష్ పిలుపునివ్వడం జరిగింది ఈ సందర్భంగా పోతుల సురేష్ చల్లా అరుణ్ నిరుగంటి వేణుగోపాల్ లు మాట్లా డుతూ భారతీయ జనతా పార్టీ వారసత్వం లేని పార్టీ అని కాంగ్రెస్ పార్టీ మాదిరిగా బోఫోర్స్ కుంభకోణాలు బొగ్గు కుంభకోణాలు ఎక్కడ భారతీయ జనతా పార్టీలో అవినీతికి తావు లేకుండా కార్యకర్త నాయకుడు అనే భేదాభిప్రాయం లేకుండా ప్రతి కార్యకర్తకు పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని చిన్న పెద్ద తారతమ్యం లేకుండా ముందుకు నడిపించే ఏకైక పార్టీ బిజెపి పార్టీ అని రాబోవు సంస్థాగత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు ఎక్కడైతే బలమైన అభ్యర్థులు ఉన్నారో అక్కడ పోటీ లో ఉండే విధంగా కార్యాచరణ సిద్ధం చేసుకుని ముందుకు వెళదామని అందుచేతనే నవ ంబర్ 9 వ తారీఖున మండల వ్యాప్తంగా ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు పుట్టపర్తి సత్యమ్మ దేవాలయం ఆవరణ ంలో జరిగే ప్రజా ఆత్మీయ సమావేశానికి తరలిరావాలని అదేవిధంగా ఈ కార్యక్రమానికి వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు మంత్రులు ఎంపీలు పెద్ద ఎత్తున హాజరవుతున్నారని ప్రతి గ్రామం నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా తెలియజేశారు

రైతుల కోసం అధికారులు పని చేయండి

- సమావేశాలకు రాని అధికార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయండి - జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ

మాట్లాడుతున్న జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ, అక్టోబర్ 29 ప్రభాతవార్త

జిల్లాలో రైతుల అభ్యన్నతి, రైతు సమస్యల పరిష్కారం వ్యవసాయ అధికారులు పని చేయాలని జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జడ్పి స్టాండింగ్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన నాలుగు అంశాలు ఇతర సభ్యుల అధ్యక్షతన మూడు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంపై జరిగిన సమీక్షలో సీజన్ ముగుస్తున్నా పప్పుశనగ విత్తన సరఫరా అందడం లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా రైతులు ప్రభుత్వ విత్తనం అందించకున్నా వేలాది రూపాయలు ఖర్చు చేసి పంటలు సాగు చేస్తున్నారని, అయినా పంటల సాగు వివరాలను అధికారులు నమోదు చేయకపోవడం వల్ల రైతులు పంట నష్టం జరిగినా ప్రభుత్వ సాయం అందని పరిస్థితి ఏర్పడిందని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ సభ్యులు చేసిన సూచనలను పరిగణలోకి తీసుకుని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

అదే విధంగా గ్రామీణ అభివృద్ధిపై జరిగిన చర్చలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పింఛన్లు ఎన్ని అందించారని, స్పౌజ్ మరణిస్తే వారి భాగస్వామికి అందించడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. అర్హులందరికీ పింఛన్లు అందేలా చూడాలని, స్వయం సహాయక సంఘాలలో జరిగిన నిధుల దుర్వినియోగంపై బాధ్యులపై చర్యలు తీసుకుని రికవరీలు చేపట్టాలని జడ్పి చైర్మన్ సూచించారు. అదే విధంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ భవనాలకు జడ్పి నుంచి భవనాల నిర్మాణాలకి నిధులు కేటాయించామని, వాటి పురోగతి ఏమిటని జడ్పి చైర్మన్ ప్రశ్నించారు. అధికారులను ఆరాతీయగా సంబంధిత శాఖ సత్యసాయి జిల్లా అధికారులు లేకపోవడంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశాలకు రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. అదే శిధంగా అభివృద్ధి కార్యక్రమాలకు జడ్పిటిసిలతోపాటు ఇతర ప్రజా ప్రతినిధులకు ప్రోటోకాల్ పాటించేలా చూడాలని అధికారులను సూచించారు. అంతకు మునుపు ఇటీవల మృతి చెందిన మాజీ జడ్పి చైర్మన్ రెడ్డెప్పరెడ్డికి సంతాపం ప్రకటిస్తూ సభ్యులు మౌనం పాటించారు. కార్యక్రమంలో జడ్పి సిఇఓ శిశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, స్టాండింగ్ కమిటీ సభ్యులైన జడ్పిటిసి సభ్యులు మహేష్, జూటూరు చంద్ర, రామచంద్రారెడ్డి, భాస్కర్, హసీనాభాను తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి నియోజవర్గం లో వైసీపీకి భారీ షాక్

వైసీపీ నుంచి 55 కుటుంబాలు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరిక - టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.

వైసీపీ నుంచి టిడిపిలోకి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే,మాజీమంత్రి టిడిపి నాయకులు దృశ్యం

కొత్తచెరువు, అక్టోబర్ 29 ప్రభాతవార్త.

కొత్త చెరువు మండలంలో సుమారు 55 కుటుంబాలు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో వైసీపీనీ వీడి తెదేపాలోకి భా చేరారు. కొత్తచెరువు మండలం కొడవగానిపల్లి గ్రామంలో 31 కుటుంబాలు,వేములేటి పల్లి గ్రామంలో 25 కుటుంబాలు వైసీపీనీ వీడి టీడీపీ కండువా కప్పుకొన్నారు. వైసీపీ ప్రభుత్వం లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, మా కుటుంబాలకు న్యాయం జరగలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి సాధ్యమని భావించి వైసీపీ నుంచి తెదేపాలోకి చేరిన గ్రామవార్డు సభ్యులు గోపాల్ ,సుబ్బరాయుడుతో పాటు పలువురు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని విమర్శించారు. . పుట్టపర్తి నియోజకవర్గం లో సుమారు 24 కోట్లతో అన్ని గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు అంతేకాకుండా పుట్టపర్తిలో శ్రీ భగవాన్ సత్యసాయి బాబా 100 వ జయంతోత్సవాలకు పలు అభివృద్ధి పనులు సాగుతున్నాయని అన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో 87 వేల కోట్లతో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ఎంతో చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రాష్ట్రంలో మంచి ప్రభుత్వం కొనసాగుతూ గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. వైసీపీని వీడి తెలుగుదేశం లోకి చేరిన ఆ కుటుంబాలకు తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని భావించి వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. అన్ని వర్గాలకు సమన్యాయం తెదేపా తోనే సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి నిరుపేద కుటుంబానికి కుటుంబంలో ఏడాదికి సగటున 1.50 లక్షల నుంచి 2 లక్షల వరకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. మంచి ప్రభుత్వాన్ని ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను ఆదరించాలని మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. కొడవగాని పలికి చెందిన మహబూబ్ జాన్ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 71250 రూపాయలను, నాగేంద్ర కు రూ.26477 ల ఆర్థిక చెక్కును ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతులమీదుగా అందజేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీలోకి చేరిన వారిలో గోపి ఈశ్వరమ్మ నాగన్న రంగా రత్న నగేష్ రంగమ్మ శ్యామల గంగన్న కాంతమ్మ గోపి చిన్న నరసింహులు వరలక్ష్మి నాగన్న సుబ్బమ్మ ఈ గంగన్న వై లక్ష్మమ్మ డి గంగన్న పకీరప్ప చెక్కిరన్న మిద్దె బాబయ్య సుభాషిని లక్ష్మీనరసమ్మ రామంజి బావయ్య తోపాటు పలువురు తెదేపాలోకి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో కొత్తచెరువు మండల టిడిపి కన్వీనర్లు రామకృష్ణ, వలిపి శ్రీనివాసులు, కొడవగాని పల్లి శివ ,బండ్లపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.అనంతరం తలమర్ల లో డీలర్ బాలకృష్ణారెడ్డి తోపాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి గారి పూర్వీకులైన బంధువులు వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తలమర్ల సింగల్ విండో అధ్యక్షులు గోపాల్ రెడ్డి, రమేష్ ,తలమర్ల కొడవగానిపల్లి వేములేటి పల్లి గ్రామాలు చెందిన టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం, ప్రజల కోసం భయం, పక్షపాతం లేకుండా పని చేయాలి

కారుణ్య నియామకాల కింద 78 మందికి ఉద్యోగ అవకాశాలు - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించిన కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ అక్టోబర్ 29 ప్రభాతవార్త

ప్రభుత్వం, ప్రజల కోసం ఎలాంటి భయం, పక్షపాతం లేకుండా బాగా పని చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో అభ్యర్థులకు కారుణ్య నియామకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 78 మంది దరఖాస్తుదారులకు కారుణ్య నియామకాల పత్రాలను జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కారుణ్య నియామకాల కింద మొత్తం 78 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేయడం జరిగింద న్నారు. కారుణ్య నియమాకాలు చాలా కాలం నుంచి పెండింగ్ ఉన్నాయని, గత ఒకటిన్నర నెల రోజుల నుంచి ప్రత్యేక డ్రైవ్ గా దీన్ని పూర్తి చేయాలని నిర్ణయం తీసుకొని ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లామ న్నారు. కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, ఏ సెక్షన్ సూపరింటెండెంట్, డిఆర్ఓ, సిబ్బంది కారుణ్య నియామకాల అంశంపై కూర్చుని బాగా పనిచేశారని, వారందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ సర్వీసులో పనిచేయాలన్న అవకాశం తక్కువ మందికి దొరుకుతుందని, ఉద్యోగంలో రకరకాల ఇబ్బందులు రావచ్చని, ఒత్తిడిలు కూడా వస్తాయని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం బాగా పని చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, క్షేత్రస్థాయిలో సిబ్బంది పనిచేసి ఫైల్ పం పిస్తేనే ఉన్నత స్థాయిలో ఆమోదం లభిస్తుందన్నారు. రకరకాల శాఖల్లో ఉద్యోగాలు పొందిన వారు మంచిగా పని చేయాల ని, ప్రజలకు చేయగలిగిన లబ్ధి కలిగించాలని, అందరికీ అభి నందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మ లోల, కలెక్టరేట్ ఏవో అలెగ్జా ండర్, ఏవో కార్యాలయం అధికారులు, అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్ పర్సన్ ఇంచార్జ్ పదవి దక్కేది ఎవరికో..?

కళ్యాణదుర్గం పట్టణంలో ఆసక్తిగా సాగుతున్న చర్చ రాజకీయ వర్గాల్లో వాడి వేడిగా ఊహాగానాలు

కళ్యాణదుర్గం అక్టోబర్ 29 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ చైర్మన్ తలారి రాజ్ కుమార్ ను రాష్ట్ర ప్రభుత్వం తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో వాడిగా వేడిగా ఊహాగానాలు సాగుతున్నాయి. గత మునిసిపల్ పాలకవర్గ ఎన్నికలలో వైసిపి పార్టీకి 19 స్థానాలు, తెలుగుదేశం పార్టీకి నాలుగు స్థానాలు, ఇండిపెండెంట్గా ఒక స్థానం గెలుచుకున్న విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో అప్పట్లో అధికారంలో ఉన్న వైసిపి కౌన్సిలర్లు పలువురు చైర్మన్ పదవి కోసం పోటీపడ్డారు. అయితే ఈ పదవిని వాల్మీకి సామాజిక వర్గానికి కేటాయించడంతో అప్పట్లో మంత్రిగా ఉన్న ఉషశ్రీ చరణ్ గొప్పగా విద్యావంతుడు కాకపోయినా తోపుడు బండిలో అరటి పళ్ళు విక్రయించే పదవ వార్డు అభ్యర్థి రాజ్ కుమార్‌ను అనూహ్యంగా కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ గా ప్రకటించి సంచలనం సృష్టించారు. ఈ నిర్ణయం కొంతమంది కౌన్సిలర్లు అభిప్రాయ వేదాలకు కారణమైంది. ఇదిలా ఉండగా వైస్ చైర్మన్లుగా ఓసి సామాజిక వర్గానికి చెందిన ఆర్యవైశ్యులు జయం పనింద్రను మొదటి వైస్ చైర్మన్ గాను, దళిత వర్గానికి చెందిన తిమ్మప్పను రెండవ వైస్ చైర్మన్ గాను నియమించారు.

అయితే అప్పటి మంత్రి ఉషశ్రీ చరణ్ అనుకూలంగా ఉన్న జయం పనింద్రను షాడో చైర్మన్‌గా చేయాలనే ప్రయ త్నం బెడిసి కొట్టడంతో తలారి రాజ్ కుమార్ కు తన చైర్మన్ సీటు కూడా దక్కకుండా చేయడంతో వివాదంగా మారిన విషయం కూడా పాఠకులకు తెలిసిందే. అనంతరం చైర్మన్ తలారి రాజ్ కుమార్ మున్సిపల్ నిర్వహణలో అంటి ముట్టనట్టుగా వ్యవహరించి అసలు చైర్మన్ ఉన్నాడా అనే సందేహం కలుగజేశారు. ఇలా సాగుతున్న తరుణంలో సాధా రణ ఎన్నికలు రావడం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపల్ కార్యక్రమాలకు ఆటం కం కలిగిన విషయం తెలిసిందే. పట్టణములో అభివృద్ధి కుంటుపడుతున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే సురేంద్రబాబు చొరవ తీసుకొని ప్రతిపక్ష పార్టీకి చెందిన చైర్మన్ తలారి రాజ్ కుమార్ ను పక్కన కూర్చో పెట్టుకుని అభివృద్ధికి బాటలు వేయాలని చేసిన ప్రయత్నం విఫలమైంది. పట్టణములో అత్యంత ప్రధానమైన డ్రైనేజీ వ్యవస్థకు శాశ్విత పరిష్కారం చూపే మూడు కోట్ల పనుల నిర్వహణ జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో ఆరు మంది కౌన్సిలర్లు టిడిపి తీర్థం పుచ్చుకోగా, బిజెపిలో చేరిన స్వతంత్ర అభ్యర్థితో కలుపుకుని 11మంది కౌన్సిలర్లు టిడిపి వైపు వచ్చినట్లయింది. అయినా పాలక పక్షంలో ఉన్న వైసిపి పరిపాలనలో ఆసక్తి కనబరచక పోవడంతో పట్టణ అభివృద్ధి అటకెక్కింది. ఈ నేపథ్యంలో నాలుగు సంవత్సరాల పాలనా కాలం అనంతరం విధి నిర్వహణలో చట్టబద్ధంగా సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం పలు ఫిర్యా